క్లుప్తంగా

నేడు సీజేఐటీలో కృతజ్ఞత దివ్య బలిపూజ



జనగామ: జనగామ మండలం యశ్వంతాపూర్ క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో నేడు (ఆదివారం) సాయంత్రం కృతజ్ఞత దివ్య బలిపూజను నిర్వహించనున్నట్లు కళాశాల సీజేఐటీ ఫాదర్, టి.అగస్టీన్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కళాశాల స్థాపించి 25 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. వేలాది మంది విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందిస్తూ, విజయవంతంగా ముందుకు వెళ్లడం ఆ దేవుని అత్యున్నత ఆశీర్వాదంతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ డయాసిస్ బిషప్ డాక్టర్ ఉడుముల బాల హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యంతో పాటు ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాకు చెందిన ఫాదర్లు, సిస్టర్స్ పాల్గొంటారన్నారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి



పాలకుర్తిటౌన్: విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు విద్యా సంస్థలు కృషి చేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్‌లో కరస్పాండెంట్ జక్కుల రవీందర్ ఆధ్వర్యాన నిర్వహించిన సిద్ధార్థ విద్యాలయం సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటున్నారని, ఇందుకు రాష్ట్రంలో ఉన్న నాణ్యమైన విద్యా సంస్థలే కారణమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డీఈఓ రాము, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్ అశోక్ రెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు మదార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం



జనగామ: పట్టణంలోని ముసిపట్ల రాజు, శృతి దంపతుల కుమార్తె శ్రీయుష్మి పుట్టిన రోజు సందర్భంగా శనివారం స్థానిక రాజరాజేశ్వరీ వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారులు వంగ భీమ్ రాజు మాట్లాడుతూ రోడ్డుపక్కన అభాగ్యులు, అనాథల కడుపు నింపేందుకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, నరేష్, అరుణ్, శేఖర్, నరేష్, పరమేష్, బన్నీ, కుమార్ పాల్గొన్నారు.

శబాబ్ కమిటీ ఏకగ్రీవం



జనగామ: జిల్లా మైనార్టీ యువజన సంఘం జమేతుష్ శబాబ్ కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అబ్దుల్ రెహమాన్(షకీల్), కార్యదర్శిగా మహ్మద్ సాజిద్, కోశాధికారిగా ఎండీ.అక్తర్‌పాషా ఎన్నికైనట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎలక్షన్ అధికారుల కమిటీ మాజీ అధ్యక్షుడు ఎండీ.ఎజాజ్, ఎండీ.ఖాదర్, ఎండీ.అన్వర్, ఎండీ.ఇక్బాల్, ఎండీ.ఫయాజ్, ఎండీ.వలి ఉర్ రెహమాన్ ఎన్నికలను పర్యవేక్షించారని పేర్కొన్నారు.

జీడికల్ అంగడి వేలం రూ.13 లక్షలు



లింగాలఘణపురం: మండల పరిధి జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతీ శనివారం నిర్వహించే అంగడిలో రహదారి క్రయవిక్రయానికి కలెక్టరేట్‌లో శనివారం వేలం నిర్వహించారు. తిరుమలగిరికి చెందిన గిలకత్తుల రమేష్ రూ.13 లక్షల 5వేలకు దక్కించుకున్నాడు. ఈఓ శేషుభారతి, దేవస్థాన చైర్మన్ మధు, డైరెక్టర్లు లక్ష్మణ్, శ్రీశైలం, రాజశేఖర్, బొల్లంపల్లి వెంకటేశ్, సీనియర్ అసిస్టెంట్ రాములు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



అక్కపెల్లిగూడెంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. మండలంలోని ఇప్పగూడెం, అక్కపెల్లిగూడెంలో అభివృద్ధి పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అక్కపెల్లిగూడెంలో సర్పంచ్ కడుదుల జ్యోతినర్సిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం..

ఇప్పగూడెంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరైన ఎమ్మెల్యే రాజయ్యకు గౌడసంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న రేణుకా ఎల్లమ్మ, కంఠమహేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి సహకరించాల్సిందిగా ఎమ్మెల్యేను గౌడ సంఘం నాయకులు కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

చిన్నారికి వైద్య పరీక్షలు చేసిన ఎమ్మెల్యే..

ఇప్పగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే రాజయ్య గ్రామానికి చెందిన ఓ చిన్నారికి పీహెచ్‌సీ వద్ద వైద్య పరీక్షలు చేశారు. స్వయంగా పిల్లల డాక్టర్ అయిన రాజయ్య చిన్నారికి వైద్య పరీక్షలు చేసి మందులు రాసిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, సర్పంచ్ జక్కుల పరుశరాములు, ఎంపీటీసీ నెలమంచ శైలజ అజయ్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలనాథ స్వామి కల్యాణానికి ముస్తాబు



తిరుమలనాథస్వామి దేవాలయం, (ఇన్‌సెట్‌లో) స్వామివారి మూలవిరాట్

స్టేషన్‌ఘన్‌పూర్: స్థానిక బస్టాండ్‌కు సమీపాన ఉన్న శ్రీ తిరుమలనాథ స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి కల్యాణాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 8వ తేదీవరకు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతీ రోజూ విశేష పూజలను నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 8వ తేదీవరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఉండగా ప్రధాన ఘట్టమైన తిరుమలనాథస్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 5న నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కలకోట రంగాచార్యులు, ప్రధాన అర్చకులు కలకోట రామానుజచార్యులు, శేషాచార్యులు తెలిపారు.

ఎస్సై ప్రత్యేక పూజలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ తిరుమలనాథస్వామి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలను చేపట్టారు. పూజల్లో ఎస్సై శ్రావణ్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. యాగశాల నిర్మాణ దాత, వ్యాపారవేత్త గన్ను శ్రీనివాస్, సునీత దంపతుల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కుంభం నరేందర్, మహంకాళీ రవీందర్, నాగబండి వెంకట్రాంనర్సయ్య, యాద శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

జనగామ: న్యాయమైన డిమాండ్ల సాధనకు విద్యుత్ ఉద్యోగుల నిరసన శనివారం నాల్గో రోజు కొనసాగింది. స్థానిక ఎస్‌ఈ కార్యాలయం ఎదుట జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎస్‌ఈ వేణుమాధవ్, డీఈ కేవీఎల్.రెడ్డి, ఎంఆర్‌టీ డీఈ విజయ్‌కుమార్, టెక్నికల్ డీఈ రవిశంకర్, జేఏసీ నాయకులు సునీల్‌రెడ్డి, సీహెచ్.నరేందర్‌రెడ్డి, శంకర్, ప్రభావతి, కనకయ్య, రాంబాబు, రవీందర్, సురేష్, శ్రీనివాస్, శ్రీకర్, రాజేష్, అశోక్, నర్సింహ్మారెడ్డి, బాలు, చంద్రభాను, మోహన్, శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్ పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన తప్పనిసరి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ

బచ్చన్నపేట: ప్రతీ విద్యార్థి చదువుతో పాటు సైన్స్ పట్ల కూడా తప్పనిసరిగా అవగాహన కలిగిఉండాలని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను ఆయన సందర్శించి విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను తిలకించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అసక్తి పెంచుకోవాలి

జనగామ రూరల్: నిత్యజీవితంలో ఉపయోగపడే విధంగా విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తిని పెంచుకోవాలని ఎంపీపీ మేకల కళింగరాజు అన్నారు. మండలంలోని శామీర్‌పేట జెడ్పీహెచ్‌ఎస్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సైన్స్ ఫెయిర్‌ను ఎంపీపీ ప్రారంభించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తల చరిత్రలను తెలుసుకొని సమాజాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాండ్ర స్వరూప, ఉప్పలయ్య, సంపత్, రమేష్, ప్రధానోపాధ్యాయుడు ఆర్. శ్రీనివాస్, సుధీర్‌రెడ్డి, భాను తదితరులు పాల్గొన్నారు.



ఎగ్జిబిట్లను తిలకిస్తున్న రమణారెడ్డి

ఇందిరమ్మ లబ్ధిదారులకు న్యాయం చేయండి



దీక్షలు చేస్తున్న మూడో విడత లబ్ధిదారులు

జనగామ: పట్టణంలో ఇందిరమ్మ మూడో విడత లబ్ధిదారులకు న్యాయం చేయాలని పోరాట సంఘం సహాయ కార్యదర్శి అబ్రహం లింకన్ కోరారు. చిట్యాల ఐలమ్మనగర్ డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 24వ రోజుకు చేరుకోగా, ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 2012–13లో ఇళ్ల స్థలాలను కేటాయించి, పట్టాలు అందించారన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, అందులో ఆరు నెలల్లోగా డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చి మాట మరిచిందన్నారు. అసలు లబ్ధిదారులను వదిలి, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారి కోసం సర్వే చేయడం ఏంటన్నారు. ఈ విషయంలో కలెక్టర్ స్పందించాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ అధ్యక్షుడు కళ్యాణం లింగం, రాజరత్నం, ఎర్ర రజిత, జయ, వలబోజు కళ్యాణ్, తులసి, సింగార ఉపేంద్ర, యాదమ్మ, భాగ్యలక్ష్మి, చిలుక సునీత, ఎండి అలీ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ధరలు తగ్గించాలి



జనగామ రూరల్: పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని ఐద్వా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర రజిత డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఐద్వా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పేదలను దోచుకుంటుందని విమర్శించారు. బూడిద అంజమ్మ, ప్రభావతి, భానుప్రియ, సుజాత, నర్సమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు ఇవ్వండి



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

చిల్పూరు: గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని శనివారం ఎమ్మెల్యే రాజయ్య, ఎంపీ పసునూరి దయాకర్‌ను వేర్వేరుగా నాయకులు కలిసి వినతి పత్రాలు అందజేశారు. ముందుగా హనుమకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండాపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే రాజయ్యను కలిసి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటునకు స్థల సేకరణ, గద్దె నిర్మాణ పనులు చేపట్టామని విగ్రహాన్ని అందివ్వాలని కోరారు. అనంతరం ఎంపీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన జిమ్ పరికరాలు, గ్రామంలోని ముఖ్య కూడళ్లలో రెండు హైమస్ట్ లైట్లు కావాలని కోరారు. లోడెం రవీందర్, ఎల్లయ్య, గాలి ప్రవీన్, సత్యం, ప్రకాష్, కనుకయ్య, రవి, రాములు, మోతె చంద్రయ్య, కుమార్, కొంరయ్య పాల్గొన్నారు.

ఖబ్రస్తాన్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించాలి



భూమిని డిజిటల్ సర్వే చేయిస్తున్న జాకీర్ పటేల్

బచ్చన్నపేట: ముస్లింల ఖబ్రస్తాన్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని జనగామ జామియా మజీద్ అధ్యక్షుడు మనీహర్ రెహమన్ జాకీర్ పటేల్ కోరారు. శనివారం మండలంలోని ఆలింపూర్ ఖబ్రస్తాన్ భూమిని డిజిటల్ సర్వే చేయించి హద్దులను నిర్ణయించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని ముస్లిం ఖబ్రస్తాన్‌ల భూములకు డిజిటల్ సర్వే నిర్వహించి చుట్టూ ప్రహరీని నిర్మించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని అన్నారు. సామాజిక సేవకుడు మహమ్మద్ యాకూబ్ పాషా, ఎంపీటీసీ మసూద్, నాయకులు నూరుద్దీన్, మహమ్మద్ షఫీ, ఇక్బాల్ పాల్గొన్నారు.

ఎన్నిక



జనగామ రూరల్: జనగామ మండల ఆటో డ్రైవర్స్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నామాల నర్సిహులు, ఉపాధ్యక్షుడిగా వర్రె సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌డీ ఉస్మాన్, కార్యదర్శులుగా నర్సింహస్వామి, చంద్రం, కోశాధికారిగా ప్రకాష్, ఆర్గనైజర్‌గా ఎ.మురళి తోపాటు సభ్యులు ఎన్నికయ్యారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

● తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య



మాట్లాడుతున్న రాపర్తి సోమయ్య

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, కూలీలు ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య అన్నారు. మండల కేంద్రంలో రైతు సంఘం, ప్రజా సంఘాలతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర సర్కారు రైతులకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని, కనీస మద్దతు ధర చట్టం చేస్తామని చెప్పి ఇప్పటి వరకూ అమలు చేయలేదన్నారు. ఎరువుల సబ్సిడీ కుదించడం వల్ల రైతుల ఆహార భద్రతకు ముప్పు వస్తోందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి పని గంటల విధానాన్ని పెంచి కార్మికుల నడ్డివిరిస్తున్నదని మండిపడ్డారు. పేదలకు ఉపయోగపడే 'ఉపాధి హామీ' పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ సర్కారు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ విధానాలను ఎండగట్టేందుకు ఈనెల 9న స్థానిక ఆర్య వైశ్య భవనంలో నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు ఎండీ.షభానా, నక్క యాకయ్య, గుండెబోయిన రోజా, పిన్నింటి సమ్మయ్య, ఎండీ.శంషొద్దీన్, వేల్పుల చిన్నరాములు, నక్క సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీ భవన్‌కు తరలిన కాంగ్రెస్ నేతలు

దేవరుప్పుల: గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు థాక్రే ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శనివారం జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పాలకుర్తి నియోజకవర్గ ముఖ్యనేతలు తరలివెళ్లారు. వీరి వెంట పాలకుర్తి నియోజకవర్గ ముఖ్య నాయకులు, టీపీసీసీ మెంబర్ డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, కొడకండ్ల, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, జాటోత్ హామ్య నాయక్, ఆయా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, పెద్ది కృష్ణమూర్తి గౌడ్, ధరావత్ సురేష్ నాయక్, జక్కుల రామిరెడ్డి, ముద్దసాని సురేష్, మాచర్ల ప్రభాకర్ ఉన్నారు

నివాళి

లింగాలఘణపురం: జనగామ విజయ డెయిరీ మ్యాక్స్ సొసైటీ ఉపాధ్యక్షుడు మండలంలోని కుందారం గ్రామానికి చెందిన కాచరాజు గీతాప్రసాద్‌రావు (65) శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, కాంగ్రెస్ నాయకులు మల్లారెడ్డి, బాబు, సర్పంచ్ సుగుణమైసరాములు, ఎంపీటీసీ రజిత ఉపేందర్, ఎంపీటీసీ నర్సయ్య, లింగాలఘణపురం సర్పంచ్ విజయ్‌మనోహర్, అశోక్ తదితరులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మొక్కల తొలగింపు



బచ్చన్నపేట: కొడవటూర్–బండనాగారం దారిలో మూల మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించినట్లు బండనాగారం సర్పంచ్ శివరాత్రి కవితరాజనర్సు తెలిపారు. శనివారం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని సబ్‌స్టేషన్ మూలమలుపు వద్ద రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనదారులు కనిపించడం లేదన్నారు. దీంతో ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. అందుకే వాహనాలు కనిపించేలా పిచ్చి మొక్కలను తొలగించామని తెలిపారు. మూలమలుపుల వద్ద వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



తరిగొప్పుల: స్వయంపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

తరిగొప్పుల: మండలకేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో స్వయంపరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు సమావేశంలో హెచ్ఎం వాంకర్ రాంచంద్రం మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఎస్ఎంసీ చైర్మన్ జంగ వీరయ్య, వైస్‌చర్మన్ ఆవుల రజిత, ఉపాధ్యాయులు బానోత్ రవీందర్, చిరంజీవులు, యాదగిరి, యూసఫ్ పాషా, రజని, నర్సయ్య, అమర్‌నాథ్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట మండలంలో..

బచ్చన్నపేట: మండలంలోని పడమటికేశ్వాపూర్ ప్రాథమిక, నారాయణపూర్ సెకండరీ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మానసపేట రవీందర్, హెచ్ఎంలు రజిత, ఉదయ్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ మంజుల, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, జీవనకుమారి, మాశి, ఆదేష్, కృష్ణకళ, ఉప్పలయ్య, శ్రీదేవి, నీలిమ, శ్రీలక్ష్మి, కర్ణాకర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బచ్చన్నపేట: ఉపాధ్యాయులతో విద్యార్థులు

నేడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ప్రవేశ పరీక్ష

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ కామన్ ఎంట్రన్స్ టెస్టు ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలలో ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కాళహస్తి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సమయానికి హాజరుకావాలని పేర్కొన్నారు.

ఒగ్గు కళాకారులకు ఆదరణ కరువు



ఒగ్గు కథ చెబుతున్న గొల్ల కురుమ కళాకారులు (ఫైల్)

చిల్పూరు: ఒగ్గు కథలు చెబుతూ కుటుంబాలను పోషించుకునే కళాకారులకు ప్రభుత్వం నుంచి ఆదరణ లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని చిన్నపెండ్యాలకు చెందిన సుమారు 40 మంది కళాకారులు ఆనవాయితీగా గొల్ల కురుమల ఇళ్లలో ఏ చిన్న పండుగ నిర్వహించినా కళాకారులు వెళ్లి మల్లన్న పట్నాలు వేసి, మల్లన్న, ఎల్లమ్మ కథలు చెబుతుంటారు. అంతే కాకుండా కొమురవెల్లి మల్లన్న, ఐనవోలు, గట్టుమల్లన్న, ఓదెల దేవాలయాల్లో పూజారులుగా కొనసాగుతూ సరైన ఆదరణ లేక అనేక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం టీవీలు, డీజేలు రావడంతో వారి జీవితాలు మరింత దుర్భరంగా మారాయి. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే కళాకారులను ఆదుకుంటామన్న ప్రభుత్వం కొందరినే ఎంపిక చేసింది. తమను కూడా ఆ జాబితాలో చేర్చి ఆదుకోవాలి.

– కొన్నె వెంకటయ్య

నెలకు రూ. 30 వేలు అందించాలి..



గొల్ల కురుమ కళాకారులను ప్రభుత్వ సాంస్కృతిక కళాకారులుగా గుర్తించి నెలకు రూ. 30 వేలు అందించాలి. అలాగే ప్రభుత్వం తమ ఆటపాటలను అన్ని చోట్ల ప్రదర్శించేలా ఏర్పాట్లు చేయాలి.

– కొన్నె మధు

సంక్షిప్తంగా

స్టడీ మెటీరియల్ అందజేత

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కళ్లెంకు చెందిన యెడ్ల నర్సయ్య శనివారం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. మారిన పదో తరగతి పేపర్ల విధానానికి అనుగుణంగా విద్యార్థులు అధిక మార్కులు సాధించేందుకు అందజేసినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నర్సయ్య సేవలను సర్పంచ్ విజయ్‌మనోహర్, హెడ్మాస్టర్ పద్మ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు మహాత్మా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు గంట రవీందర్ స్టడీ మెటీరియల్‌ను శనివారం అందజేశారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

రఘునాథపల్లి: మండలంలోని నిడిగొండలో డీఆర్‌డీఓ పీడీ రాంరెడ్డి, జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ జ్యోత్స్న ఆదేశాల మేరకు శనివారం ఆర్టీసీ ఉద్యోగుల అర్హులైన దివ్యాంగులకు బస్‌పాస్ మేళాను నిర్వహించారు. గ్రామ పంచాయతీ వద్ద అర్హులైన దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆర్టీసీ ప్రతినిధి రాజు మాట్లాడుతూ దరఖాస్తులు అందజేసిన దివ్యాంగులకు మూడు రోజుల్లో బస్‌పాస్‌లు అందజేస్తామన్నారు. సర్పంచ్ బిర్రు లక్ష్మినర్సింహులు, వీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బిర్రు నాగేష్, వాతాల యాదగిరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

లింగాలఘణపురం: మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ సంఘం అధ్యక్షుడు కోల్ల మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి సూడి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పసునూరి సోమరాజు, కృష్ణమూర్తి ఉన్నారు.